
సాక్షి పల్నాడు

శనివారం | 2 | సెప్టెంబర్ | 2023



ప్రత్యేక పూజల్లో న్యాయమూర్తి

చిలకలూరిపేట: బొప్పూడిలోని మల్లేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద శుక్రవారం నిర్వహించిన పూజల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 523.30 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 851.70 అడుగుల వద్ద ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 3920 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

వైద్య విధాన పరిషత్ డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు



గుంటూరుమెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిగా డాక్టర్ కె.సుబ్రహ్మణ్య రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కాపురం జిల్లా ఆసుపత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పనిచేస్తున్న ఆయనకు డీసీహెచ్ఎస్‌గా ప్రమోషన్ ఇచ్చి ప్రభుత్వం గుంటూరుకు బదిలీ చేసింది. రెగ్యులర్ డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ రత్నాకర్ సెప్టెంబరు నుంచి సెలవులో ఉండటంతో డాక్టర్ హనుమంతరావు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ హనుమంతరావు నుంచి డాక్టర్ సుబ్రహ్మణ్యం రాజు బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ డీసీహెచ్ఎస్‌గా విధుల్లో చేరిన డాక్టర్ సుబ్రహ్మణ్య రాజుకు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

రేపు జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు

గుంటూరుఎడ్యుకేషన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలను ఆదివారం గుంటూరు రైలుపేటలోని కన్న ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఏ.సత్యనారాయణ ప్రసాద్, బి.ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొననున్న మహాసభల్లో శాస్త్రీయ దృక్పథ ఆవశ్యకతపై సదస్సు ఉంటుందని తెలిపారు. జేవీవీ నాయకులు, సైన్స్ అభిమానులు పాల్గొనాలని కోరారు. సదస్సు అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.

మొదటిరోజు 26వేల మందికి రేషన్ పంపిణీ



నరసరావుపేట: జిల్లాలోని తెలుపురంగు రేషన్ కార్డుదారులకు ఆహార భద్రత కోసం ప్రభుత్వం ప్రతినెలా ఇచ్చే రేషన్ బియ్యం పంపిణీని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ శుక్రవారం పరిశీలించారు. నెలలో మొదటిరోజు సాయంత్రం ఆరు గంటలకు 26,034 మందికి ఫోర్టిఫైడ్ రైస్, పంచదార, పట్టణ వాసులకు ఫోర్టిఫైడ్ గోధుమ పండి పంపిణీ చేశారు. పట్టణ శివారు ఎస్ఆర్‌కేటీ కాలనీ, వెంగళరెడ్డికాలనీ, పనసతోట, వరవకట్ట, రావిపాడు గ్రామంలో ఎండీయూ వాహనాల ద్వారా నిర్వహిస్తున్న పంపిణీని డీఎస్ఓ పరిశీలించారు. జిల్లాలో 1289 రేషన్‌షాపుల ద్వారా 402 ఎండీయూ వాహనాలతో 6,36,405 మంది రేషన్‌కార్డుదారులకు ఈనెల 17వ తేదీలోగా పంపిణీ చేస్తామని ఆమె వెల్లడించారు.


నేడు తెలంగాణ గవర్నర్ రాక

మంగళగిరి: మండలంలోని నీరుకొండ గ్రామంలో గల ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మూడవ కాన్వొకేషన్‌కు తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్య రాజన్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆవరణలో జరగనున్న కార్యక్రమానికి ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మలతో పాటు యూనివర్సిటీ ఫౌండర్ ఛాన్సలర్ డాక్టర్ పీఆర్ పరివేందర్ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

చెరువులో పడి చిన్నారి మృతి

కొమ్మూరు(కాకుమాను): చెరువులో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని కొమ్మూరులో శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని కొమ్మూరుకు చెందిన గార్లపాడు పంచాయతీ కార్యదర్శి గుంటూరు నాగ సందీప్ కుమారుడు సాయి(3)తోటి చిన్నారులతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ గ్రామంలో ఉన్న మంగళి చెరువులో పడి మృతి చెందాడు. గమనించిన గ్రామస్తులు చిన్నారిని బయటకు తీసే సమయానికే మృతి చెందినట్లు తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.3,000, గరిష్ఠ ధర రూ.4,800, మోడల్ ధర రూ.4000 వరకు పలికింది.

ప్రతి గుండెలోనూ వైఎస్సార్..

- పులిచింతల ఆయన హయాంలోనే..
- గుంటూరు జిల్లాపై ప్రత్యేక అభిమానం
- ఆరోగ్యశ్రీకి జిల్లాలో శ్రీకారం
- కృష్ణా పశ్చిమ డెల్టా, నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ
- ఆయన పాలన స్వర్ణయుగం
- నేడు వైఎస్సార్ వర్ధంతి



రాజన్న.. నిన్ను మరువదు ఈ గడ్డ

నమస్తే చెల్లెమ్మా.. నమస్తే అక్కయ్య.. నమస్తే తమ్ముడు.. అనే వైఎస్సార్ పిలుపు ప్రతి ఇంటా మేల్కొలుపు అయింది.. నువ్వు ఇచ్చిన ఆరోగ్యశ్రీ భరోసాతో మా ఇంటి దీపం వెలిగింది.. చదువుల కొలిమిలో నలిగిన పేదలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రక్ష అయింది.. రైతన్నకు సాయం లేక ఉరితాడు మెడలో వేలాడే సమయంలో రుణమాఫీ ఆసరా అయింది.. వ్యవసాయం లాభసాటి చేసేందుకు.. వృథా జలాలు ఒడిసి పట్టేందుకు చేపట్టిన జలయజ్ఞం సిరుల పంట పండిస్తోంది. వైఎస్సార్ అను నేను.. అంటూ ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం మా మదిలోనే ఉండిపోయింది.. నువ్వు ఎక్కడికి పోతావు రాజన్న అంటూ స్మరించుకుంటున్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా...



2004, అక్టోబర్ 15న పులిచింతల ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రైతును రాజును చేయాలని అహర్నిశలు కలలుగన్న రైతు బాంధవుడు మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి. ఆయన హయాంలోనే రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్లారు. జలయజ్ఞంలో భాగంగా పులిచింతల ప్రాజెక్టు రూపకల్పనతోపాటు ఆయకట్టు స్థిరీకరణ కోసం పాటు పడ్డారు. రైతుల బతుకు చిత్రాన్ని మార్చడం కోసం కలలు కన్నారు. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ కోసం 2008 ఫిబ్రవరి రెండున రూ.4,444.41 కోట్లతో నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు అనుమతి ఇచ్చారు. దీని ద్వారా నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో 6.74 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో కాలువల ఆధునికీకరణ కోసం రూ. 4,573 కోట్లు కేటాయించారు. ఇందులో గుంటూరు జిల్లాకు సంబంధించి



నీటితో కళకళలాడుతున్న పులిచింతల ప్రాజెక్టు

రూ.1760.15 కోట్లను కాల్వల ఆధునికీకరణకు కేటాయించారు. ఇందులో రూ.1187 కోట్ల పనులు జరిగాయి. దీని ద్వారా జిల్లాలో 5.22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. మహానేత పదవి కాలంలో జిల్లా వాసులకు ఉపయోగపడే ఎన్నో ప్రాజెక్టులను ఆయన పూర్తిచేసి జిల్లా వాసుల్లో చెరగని ముద్రను వేసుకున్నారు. వైఎస్సార్ చివరి సంతకం చేసిన ఫైల్ కూడా జిల్లాలో మిర్చి రైతులకు వాతావరణ ఆధారిత బీమా కింద ప్రయోజనం చేకూర్చేదే. ఈ బీమాతో జిల్లాలో నాలుగు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 12వేల కోట్ల రుణమాఫీలో జిల్లా రైతులు దాదాపు 6.7 లక్షల మందికి రూ.560 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఇందిర ప్రభ జిల్లాలో ప్రారంభించి జిల్లా రైతులకు పెద్ద పీట వేశారు. ఇందిరమ్మ ఫేజ్–2 ఇళ్లను జిల్లాలోనే ప్రారంభించారు. రాజీవ్ పల్లె బాట ద్వారా ఎన్నో గ్రామాలకు తాగునీరందించి పల్లె వాసుల మనస్సులో చెరగని ముద్ర వేశారు. గుంటూరు నగరానికి దాహార్తి తీర్చేందుకు రూ.6.50 కోట్లతో తక్కెళ్లపాడు రా వాటర్ ప్లాంట్ నుంచి తక్కెళ్లపాడు నీటి శుద్ధి వాటర్ ప్లాంట్ల వరకు రెండో పైపు లైను నిర్మించారు. నగర ప్రజల నీటి కష్టాలు తీర్చిన మహానేతను నగర ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. రూ.460 కోట్లతో ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన తాగునీటి పథకానికి ఆయనే అంకురార్పణ చేశారు. రైతులకు విద్యుత్ బకాయి మాఫీ చేయడం ద్వారా జిల్లాలో 80 వేల మంది రైతులకు లబ్ధి చేకూరింది. విద్యుత్ బకాయిల మాఫీ ద్వారా జిల్లాలోని రైతులకు రూ.36 కోట్ల లబ్ధి కలిగింది. ఉచిత విద్యుత్ పథకం ద్వారా జిల్లాలోని 80 వేల మంది రైతులకు ఏడాదికి రూ. 281.60 కోట్ల లబ్ధి చేకూరింది. దీంతోపాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నిరుపేదల పాలిటి అపర సంజీవినిగా పేరొందిన ఆరోగ్యశ్రీ పథకాన్ని 2008లో గుంటూరు నుంచి ఆయన ప్రారంభించి జిల్లా ప్రజలకు మరిచిపోలేని విషయం. జిల్లాలో ముఖ్యమంత్రి హోదాలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జిల్లాలో 57 సార్లు పర్యటించారంటే ఆయనకు జిల్లాపై మమకారం ఉందో అర్థం అవుతుంది.

పులి'చింతలు' తీర్చింది

గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల చిర కాల స్వప్నమైన పులిచింతల ప్రాజెక్టును ఆయన అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే 2004 అక్టోబరు 15వ తేదీన రూ.680 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో విజయవాడ, గుంటూరు నగరాల తాగునీటి దాహార్తి తీర్చడంతోపాటు కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడానికి ఉపయోగపడుతోంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో కూడా కృష్ణా డెల్టాకు నీటి ఇబ్బంది లేకపోవడానికి పులిచింతల ప్రాజెక్టే కారణం అనడంలో అతిశయోక్తి లేదు.

గృహ నిర్మాణాలు గడువులోగా చేపట్టాలి

హౌసింగ్ కార్పొరేషన్ జేఎండీ శివప్రసాద్



అధికారిని వివరణ కోరుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, హౌసింగ్ జేఎండీ శివప్రసాద్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపల గృహ నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌తో కలిసి నిర్వహించిన గృహ నిర్మాణ శాఖ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గృహ నిర్మాణాల ప్రక్రియలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. లక్ష్యసాధనలో అలసత్వం వహించవద్దని ఆయన సూచించారు. ఐహెచ్‌హెచ్ఎల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి పురోగతిలోకి తీసుకురావాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనిదినాలను మరింత పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అసిస్టెంట్ ఇంజినీరు తమ పురోగతిని తెలియజేసే విధంగా నివేదికలను సంబంధిత ఎంపీడీవోలకు ప్రతి శనివారం అందించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వారి సూచనలను పరిగణలోకి తీసుకొని త్వరితగతిన పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు బేస్మెంట్ లెవెల్ నుంచి ఆపై వరకు 60 శాతం పనులు పూర్తయ్యాయని బిలో బేస్మెంట్ లెవల్ పనులు 19 శాతం పూర్తయ్యాయని, యుడీఐ, యుఎల్ఆర్ పనులు 21 శాతం పూర్తయ్యాయన్నారు. ఇకపై జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పెంచే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి బుధవారం నిర్వహించే క్షేత్రస్థాయి పరిశీలనలో హౌసింగ్ శాఖపై దృష్టి సారించి గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించి లబ్ధిదారులు అవగాహన కల్పించాలన్నారు. లేఅవుట్ల వద్ద సుందర ఆర్చీలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాటి నిర్మాణానికి తీర్మానాలు చేయడం జరిగిందని, పరిపాలన అనుమతులు కూడా అందజేయడం జరిగిందన్నారు. మిగిలిన వాటికి రెండు నెలల లోపల పనులు పూర్తి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకం, హౌసింగ్ శాఖ ఈఈ శివలింగం, హౌసింగ్ శాఖ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తక్కువే

- ఇంకా తగ్గేందుకు చర్యలు తీసుకోవాలి
- జిల్లా రోడ్డు సేఫ్టీ సమావేశంలో జిల్లా కలెక్టర్ శివశంకర్



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్, రోడ్డు సేఫ్టీ అధికారులు

నరసరావుపేట: జిల్లాలో గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, అవి ఇంకా తగ్గేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం చైర్మన్ అయిన కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తూ పల్నాడు జిల్లాలో 2021వ ఏడాదిలో జనవరి నుంచి జూలై వరకు 455 ప్రమాదాలు జరగ్గా, 2022లో 459 జరిగాయన్నారు. 2023లో 351 ప్రమాదాలు మాత్రమే జరిగాయన్నారు. ప్రమాదాలు తగ్గడం శుభపరిణామే అయినా ఇంకా తగ్గాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లలో సంబంధిత విభాగాల అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవేస్, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. గ్రామాల్లో కూడా చాలామంది మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈ విషయంలో ప్రజలు, కళాశాల విద్యార్థులకు అవగాహన కలిగించాలని ఎక్సైజ్, పోలీసు, రవాణా శాఖల అధికారులను ఆదేశించారు. గణపవరం, తిమ్మాపురం జంక్షన్‌లో లైటింగ్ సరిగా లేకపోవడం వలన ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ టీకే పరంధామరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా లైటింగ్ ఏర్పాటు చేయాలని నేషనల్ హైవేస్ అధికారులను ఆదేశించారు. మార్త్ (ఎమ్‌వోఆర్‌టీహెచ్), జీవోఐ ముద్రించిన రోడ్డు సేఫ్టీ బుక్‌లెట్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆర్ అండ్ బీ ఈఈ రాజా నాయక్, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ విభాగ అధికారులు, నరసరావుపేట, చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అధికారులు, రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్లు, రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో కన్వీనర్ దుర్గపద్మజ, సభ్యుడు బంగారయ్య పాల్గొన్నారు.

కౌలు రైతులకు ఆపన్న హస్తం రైతు భరోసా

18,747మంది రైతుల ఖాతాల్లో రూ.14.06కోట్లు జమ



కౌలు రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, మార్కొండారెడ్డి

నరసరావుపేట: భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులను ఆదుకోవాలనే సంకల్పంతోనే ప్రభుత్వం రైతు భరోసా నగదు జమచేస్తుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన కౌలు రైతులకు రైతు భరోసా ఐదో విడత నిధులు జమచేసే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డితో కలసి వీక్షించారు. జిల్లాకు చెందిన 18,747 మంది భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కౌలు రైతులకు రూ.14.06కోట్లు నిధులు జమయ్యాయి. సాయి మార్కొండారెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ కౌలు రైతులకు రూ.7,500 చొప్పున మొదటి విడతగా వారి ఖాతాల్లో జమౌతాయని తెలిపారు. కలెక్టర్ చేతుల మీదుగా కౌలు రైతులకు మెగా చెక్కు అందజేశారు. వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్.రవికుమార్, మస్తానమ్మ, బి.రవిబాబు పాల్గొన్నారు.

పాఠశాలలో 'స్వచ్ఛతా పక్వాడ్'

- జిల్లాలో 15 రోజులపాటు అమలుకు ఆదేశాలు
- ప్రతి రోజూ ఓ కార్యక్రమం నిర్వహణ
- పర్యవేక్షించనున్న సమగ్ర శిక్ష యంత్రాంగం



సత్తెనపల్లి ఏబీఎం పాఠశాలలో స్వచ్ఛత శపథం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సత్తెనపల్లి: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలల్లో స్వచ్ఛతా పక్వాడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శుక్రవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమాల అమలుకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీనికోసం 10 రోజులకు కార్యక్రమాలను నిర్దేశించింది. జిల్లాలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలు అమలు చేసేలా ఆదేశాలిచ్చింది. పరిసరాలు శుభ్రత, ఆరోగ్యం, చేతులు కడుక్కోవడం, మాస్కుల వినియోగం, తదితర అంశాలను ఇందులో పొందుపరిచింది. సమగ్ర శిక్ష యంత్రాంగం ఈ కార్యక్రమాలను పర్యవేక్షించనుంది. దీనిలో భాగంగా శుక్రవారం పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో స్వచ్ఛత శపథం నిర్వహణ చేపట్టారు.

ఇవీ కార్యక్రమాలు ..

- **2న** : పిల్లలకు శుభ్రత, చేతులు కడుక్కోవడం, మాస్కుల వినియోగం, సామాజిక దూరం పాటించడం వంటి అంశాలపై అవగాహన.
- **4న** : మరుగుదొడ్ల వినియోగం, మంచినీరు పొదుపుగా వాడకం, నీటిపై అవగాహన కల్పించడం.
- **6న** : ప్లాస్టిక్ నిషేధం, మరుగుదొడ్ల నిర్వహణపై అవగాహన, పోటీలు, కొవిడ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పడం.
- **7న** : పరిశుభ్రతపై చిత్రలేఖన, క్విజ్, వ్యాస, నినాదాల పోటీల నిర్వహణ.
- **9న** : భోజనానికి ముందు, తర్వాత చేతుల శుభ్రత, దివ్యాంగ విద్యార్థుల సౌకర్యాలపై అవగాహన
- **11న** : స్వచ్ఛతపై అవగాహన సందేశాలను పాఠశాల విద్య వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయడం, విద్యార్థుల చేతి గోళ్లు కత్తిరించడం, రోజూ స్నానం చేయడం, శుభ్రమైన దుస్తులు, పాదరక్షలు ధరించటంపై అవగాహన.
- **12న** : వివిధ అంశాలపై ఫొటోలు, వీడియోలు, పోస్టర్లు, పెయింటింగ్‌లు, స్వచ్ఛతా ఛాయా చిత్రాలను ప్రదర్శించడం.
- **13న** : స్వచ్ఛతా పక్వాడ్ కార్యక్రమంపై ప్రజల నుంచి సలహాలు స్వీకరించడం, కార్యక్రమంలో చేపట్టిన అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ.
- **15న** : నిర్దేశించిన కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం, ప్రశంసా పత్రాలు పంపిణీ.

కొనసాగుతున్న గోల్డ్‌లోన్ ఖాతాల పరిశీలన

- 54 ఖాతాల్లో నకిలీ బంగారం
- రూ.99.40 లక్షల రుణాలు పొందినట్లు గుర్తింపు

యడ్లపాడు: స్థానిక యూనియన్ బ్యాంక్‌లో బంగారంపై రుణాలు తీసుకున్న ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బంగారం సురక్షితంగానే ఉందని ఆ బ్యాంక్ నరసరావుపేట రీజినల్ అధికారులు శంకరరావు, మురళీమోహన్ తెలిపారు. గతనెల 30వ తేదీన యడ్లపాడు యూబీఐ అప్రైజర్ నిడమానూరి హరీష్ అదృశ్యం కావడంతో బ్యాంక్ అధికారుల బృందాలు అప్రమత్తమయ్యాయి. బంగారు ఆభరణాల పరిశీలనలో నిష్ణాతులైన ముగ్గురిని పిలిపించి సదరు బ్యాంక్‌లోని బంగారు రుణాల కింద పెట్టిన వస్తు నాణ్యత పరిశీలనకు చర్యలు తీసుకున్నారు. అలాగే గోల్డ్ లోన్ ఖాతాలను పరీక్షలు చేస్తున్నారు. ఉదయం మొదలు రాత్రి 12 గంటల వరకు ఈ పరిశీలన కొనసాగించారు. ఖాతాల్లో నకిలీ బంగారం ఉన్నట్లు గుర్తించారు. వీటికి మంజూరు చేసిన మొత్తం రుణాల విలువ రూ.99.40 లక్షలు ఉంటుందని వెల్లడించారు. అలాగే బుధవారం నాడు బ్యాంక్‌లో బంగారం తనఖా పెట్టిన ఏడుగురికి చెందిన 304 గ్రాముల బంగారానికి రూ.11.27 లక్షలు ఇచ్చినట్లు బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆర్‌ఎంలు శంకరరావు, మురళీమోహన్ విలేకరులతో మాట్లాడుతూ తమ బ్యాంక్‌లో 2012 నుంచి హరీష్ అప్రైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. బుధవారం గోల్డ్ లోన్ తీసుకున్న ఖాతాదారుల బంగారం బ్యాంక్‌కు అప్పగించకుండా అదృశ్యం కావడం, మొబైల్ ఆఫ్ చేయడంతో అనుమానంతో నిఘా కెమెరాలను పరిశీలించినట్లు తెలిపారు. ఇందులో గోల్డ్ ఆర్నమెంట్‌లను జేబులో ఉంచుకోవడం స్పష్టంగా రికార్డు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న నరసరావుపేట యూబీఐ ఆర్‌ఎం శంకర్‌రావు, పక్కన మురళీమోహన్, బీఎం తిలక్

ఎస్‌బీఐ గోల్డ్‌లోన్ ఖాతాదారులు ఆందోళన చెందవద్దు

యడ్లపాడు: అప్రైజర్ నిడమానూరి హరీష్ విషయం తెలిసి ఎస్‌బీఐ బ్యాంక్ గోల్డ్‌లోన్ ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యడ్లపాడు శాఖ మేనేజర్ పి.అనిల్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన కస్టమర్ రెస్పాండ్ అసోసియేట్ జేమ్స్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. తమ శాఖలోనూ హరీష్ కొంతకాలంగా సెకండ్ అప్రైజర్ విధులు నిర్వహిస్తున్నాడని అయితే గోల్డ్‌లోన్లకు సంబంధించి అన్ని పనుల్ని అధికారులే చూసుకుని బంగారం నాణ్యత విషయంలో తుది పరిశీలన విధిని మాత్రమే హరీష్‌తో చేయిస్తున్నట్లు తెలిపారు. బంగారం పూర్తి సురక్షితంగా ఉందని, ఇందుకు 3 నెలల కిందట అధునాతనమైన సేఫ్ లాకర్లు ఏర్పాటు చేశామన్నారు.

లక్ష్మీదేవి అలంకారంలో మహంకాళీ అమ్మవారు దర్శనం



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలం కంఠం రాజు కొండూరులో ఉన్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో మూడో శ్రావణ శుక్రవారం పలు పూజల్ని నిర్వహించారు. శ్రీ మహంకాళీ అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో నిర్వహించిన లక్ష్మీ పూజలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారిని నమ్ముకున్న భక్తులకు వారి కోర్కెలను తప్పక తీరుస్తుందని తెలిపారు. ఏర్పాట్లను ఆలయ కార్య నిర్వహణాధికారి చినవెంకటరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు , వైఎస్సార్ సీపీ నాయకులు నల్లనూకల కోటి యాదవ్, పిల్లి ధర్మరత్నం, జమ్ముల లోకేష్, ఉయ్యూరు మారుతి పాల్గొన్నారు.

కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు

అర్హత సాధించిన 164 మంది మహిళా ఎస్‌ఐ అభ్యర్థులు


పరుగు పోటీల్లో మహిళా ఎస్‌ఐ అభ్యర్థులు

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో ఎస్‌ఐ మహిళా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం జరిగాయి. 620 మంది అభ్యర్థులు హాజరవ్వగా, వారి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ, 1,600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లు నిర్వహించారు. పరుగు పోటీలు నిర్వహించే క్రమంలో పలు సూచనలు చేశారు. గత బుధవారం నుంచి శుక్రవారం వరకు కేవలం మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, ఎస్పీలు కె.ఆరిఫ్ హఫీజ్ (గుంటూరు), మల్లికా గర్గ్ (ప్రకాశం), ఏఎస్పీలు అంకితా సూరన (ఒంగోలు), కె.సుప్రజ (గుంటూరు), హైమావతి (ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు) గ్రౌండ్‌లో పర్యటించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. 620 మంది అభ్యర్థులకు 164 మంది అర్హత సాధించారు. గ్రౌండ్‌లో మౌలిక సౌకర్యాలు నెలకొల్పారు. మహిళా పోలీస్ అధికారులతో ప్రత్యేక పహారా నిర్వహించారు. ఐజీ కార్యాలయ సీఐ సుధాకర్, పలువురు అధికార, సిబ్బంది పాల్గొన్నారు.


గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎస్పీలతో మాట్లాడుతున్న రేంజ్ ఐజీ పాలరాజు

ప్రభుత్వ పథకాలతో నేతన్నలకు మేలు

ఎంపీ లావు, కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేతన్నలకు అందిస్తున్న పథకాలపై అవగాహన పెంపొందించుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. భువనచంద్ర టౌన్ హాలులో టెక్స్‌టైలు శాఖ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. ఇంట్లో మగ్గాలు ఉన్న సుమారు 250 మందికి త్వరలో అనుమతులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐకియా వంటి ప్రసిద్ధ సంస్థలతో చర్చించి చేనేత ఉత్పత్తులను మరింత ఆదరణ పొందేలా చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు

కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు పింఛన్ ఇవ్వడంతో పాటు నేతన్న నేస్తం ద్వారా మగ్గం వేసే వారికి ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ హ్యాండ్లూమ్స్ డెవలప్‌మెంట్ ద్వారా క్లస్టర్లు ఏర్పాటు చేసి వారికి ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని వివరించారు. జిల్లాకు సంబంధించి 200 నుంచి 250 మందితో ఇప్పటి వరకు మూడు క్లస్టర్లు ఉన్నాయని చెప్పారు. అందులో చిలకలూరిపేట, నరసరావుపేట, మాచర్లలో ఉన్నాయన్నారు. మరో రెండు క్లస్టర్లు చిలకలూరిపేటలో మరొకటి, వినుకొండ నియోజకవర్గం ఆరేపల్లి ముప్పాళ్లలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. ఒక్కొక్క క్లస్టర్‌కు రూ.2కోట్ల ఆర్థిక సహాయం అందించి అందులో షెడ్ నిర్మాణం, ముడి సరుకు అందుబాటులో ఉండే విధంగా క్లస్టరు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. క్లస్టర్ బయటి వారికి రూ.1.25ల క్షల వంతున వ్యక్తిగత లబ్ధి చేకూరనుందని వివరించారు. 250 మంది నేతన్నలు ఉండి షెడ్లు ఏర్పాటు చేసుకుని మగ్గం నేయడానికి అనువుగా ఉండేలా చూడాలన్నారు. పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వనజ పాల్గొన్నారు.

బోధన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలి

- విద్యార్థుల అభ్యున్నతే ఉపాధ్యాయుల లక్ష్యం
- జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారి అభ్యున్నతికి కృషి చేయటమే ఉపాధ్యాయుల లక్ష్యమని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. విద్యారంగంలో వస్తున్న మార్పులను గమనిస్తు బోధన సామర్థ్యాలను మెరుగు పరచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో గురువారం రాత్రి కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యారంగంలో సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యాసంస్థల నిర్వాహకులను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. పల్నాడు జిల్లా పరిధిలో 34 మందికి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ట్రస్ట్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావుతో కలసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, పల్నాడు జిల్లాలో ఉపాధ్యాయుల పనితీరు బాగుందని కితాబిచ్చారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లి పనిచేసేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని కోరారు. కొన్ని ప్రాంతాలలో పనిచేసేందుకు కొందరు ఆసక్తి చూపడం లేదని, అయితే ప్రజలు ఉంటేనే ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు ఉంటేనే ఉపాధ్యాయులు ఉంటారని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. తాను ఏ గ్రామానికి వెళ్లినా అక్కడి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వారికి కావలసిన వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి కె.శామ్యూల్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, ట్రస్ట్ కార్యదర్శి కె.అలీస్ పాల్గొన్నారు.


ఆక్టా రాష్ట్ర అధ్యక్షుడు మోహనరావును సత్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎంపీ లావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

వృద్ధురాలిని అక్కున చేర్చుకున్న సేవాసంస్థ

సాక్షి ఎఫెక్ట్

నాదెండ్ల: కన్న తల్లిని బిడ్డలు వీధి పాలు చేయటంతో సమాచారం ఓ స్వచ్ఛంద సేవా సంస్థ ఆ వృద్ధురాలిని ఆదుకుంది. వివరాలు.. గణపవరం రాజీవ్ గాంధీకాలనీ 5వ లైనులో నివాసం ఉండే 75 ఏళ్ల కాకరి కాంతమ్మను పది రోజుల క్రితం ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఆమె బాగోగులు చూడకుండా ఆమెను చెట్ల కింద వదిలేసి వెళ్లారు. ఈ విషయాన్ని 'అమ్మా'నుషం పేరిట 'సాక్షి' గురువారం వెలుగులోకి తెచ్చింది. నరసరావుపేట తాలూకు షెడ్యూల్ ట్రైబ్స్ యూత్ క్లబ్ చీఫ్ నిర్వాహకుడు కట్టా రమేష్‌బాబు స్పందించారు. వృద్ధురాలి పరామర్శించి తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంఎల్ గ్రూప్ ఆఫ్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ బాబూరావు, వీఆర్వోలు సాంబశివరావు, వెంకటరమణ సమక్షంతో ఆశ్రమానికి తరలించేందుకు ప్రయత్నించారు. పల్నాడు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త అక్కడకు చేరుకుని నరసరావుపేటలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


వృద్ధురాలు కాంతమ్మను సేవా సంస్థకు తరలిస్తున్న దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త

యార్డులో 17,251 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 15,010 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 17,251 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,500 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,797 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

భారత్ - యూకే సంబంధాలు మరింత బలోపేతం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్రిటిష్ డెప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్

చేబ్రోలు: భారతదేశం వేదికగా జరగబోయే జీ-20 సదస్సు ద్వారా భారత్-యూకేల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్రిటిష్ డెప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ప్రమోషన్స్ కొలాబరేషన్స్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అకడమియాతో పాటు దౌత్యపరమైన అంశాల గురించి వైస్ ఛాన్స్‌లర్ పి.నాగభూషణ్‌తో ఆయన చర్చించారు. అనంతరం విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ పి.ఎం.వి.రావు, డీన్లుతో సమావేశమయ్యారు. గారెత్ విన్ ఓవెన్ మాట్లాడుతూ విద్య, పరిశోధనలతో పాటు సాంస్కృతిక మార్పిడి, పరస్పర సహకార అవకాశాల అన్వేషణ వంటి అంశాల గురించి చర్చించామని తెలిపారు. ఉమ్మడిగా కార్యక్రమాల్ని నిర్వహించడం ద్వారా ఇద్దరి మధ్యా భాగస్వామ్యం పటిష్టంతో పాటు విద్యాపరమైన నైపుణ్యాల్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు.


గారెత్ విన్ ఓవెన్‌తో విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతినిధులు

పట్టుచీరల అలంకరణలో మెరిసిన భ్రమరాంబ

పెదకాకాని: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారిని 108 పట్టుచీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. పసుపు కొమ్ములు, చందనంతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో పొంగలి నైవేద్యాల్ని వండి సమర్పించారు. ప్రాకార మండపంలో అన్నప్రాశనలు, నామకరణలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, సభ్యులు ఏర్పాట్లు చేశారు. రానున్న నాలుగో శుక్రవారం లక్ష గాజులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఏసీ తెలిపారు.

శివాలయంలో సహస్ర దీపాలంకరణ సేవలు

శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఆలయ ప్రాకార మండపంలో సహస్ర దీపాలంకరణ సేవలు కొనసాగుతున్నాయి. ప్రతి శుక్రవారం సాయం సంధ్యలో గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తుల్ని అలంకరించి ఊంజల సేవతో సహస్ర దీపాలంకరణ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మేళతాళాలు, వేద మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా అర్చకులు పూజాదికాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికుల సౌకర్యాలు, జీతాలపై కలెక్టర్ ఆరా

నరసరావుపేట: పురపాలకపరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అందుతున్న సౌకర్యాలు, జీతాలపై జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సమీక్ష చేశారు. మున్సిపల్ అతిథి గృహంలో శానిటేషన్ సెక్రటరీలు, పారిశుద్ధ్య మేస్త్రిలతో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతమంది శాశ్వత, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు, డ్రైవరు, మేస్త్రిలు ఎంతెంతమంది ఉన్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ సకా లంలో జీతాలు అందుతున్నాయా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. బదిలీసి బ్బందిని ఎలా వినియోగించుకుంటున్నారు, వారికి జీతాలు ఎలా చెల్లిస్తున్నారు తదితర వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్ పాల్గొన్నారు.

ముగిసిన అథ్లెటిక్ మీట్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లాస్థాయి అండర్-14, 16 బాల బాలికలు అండర్-18, 20 యువతీ యువకుల అథ్లెటిక్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది పాల్గొన్నారన్నారు. 100, 200 ,400, 800, 1500 పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రోలో పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా జట్టును ఎంపిక చేసి ఈ నెల 20 నుంచి ఏలూరులో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కోచ్‌లు శరత్‌బాబు, సి.హెచ్.వి.రాజు, కె.రవి, జి.జె.కిషోర్, మోహన్, మీరావలి పాల్గొన్నారు

నెలాఖరు వరకు ఉచితంగా బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సిమ్

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవల్ని రానున్న రెండు నెలల్లో ప్రవేశపెట్టబోతున్న నేపథ్యంలో 3జీ సిమ్ ఉన్న వారు కస్టమర్ సర్వీస్ సెంటర్స్‌లో ఈ నెల 30వ తేదీలోపు ఉచితంగా సిమ్‌లను పొందవచ్చని ఆ సంస్థ జనరల్ మేనేజర్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 4జీ సిమ్‌గా మార్చుకున్నప్పటికీ 2జీ, 3జీ సేవల్లో ఎటువంటి అంతరాయం ఉండదని పేర్కొన్నారు. అధిక సాంకేతిక భద్రత కోసం బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు గతంలో పేపర్ అప్లికేషన్ ద్వారా సిమ్ కార్డు పొందిన వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డ్‌తో బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం సిమ్ 3జీ, 4జీ సిమ్ అని తెలుసుకోవడానికి తమ మొబైల్ నుంచి సిమ్ అని టైప్ చేసి 9441299999కు మేసేజ్ పంపాలని సూచించారు. ఏదైనా సందేహాలుంటే దగ్గరలోని బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించాలని తెలిపారు.

గుంటూరు మీదుగా రామానందపురానికి ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ రైల్వే ప్రయాణీకుల సౌకర్యార్థం సికింద్రాబాద్-రామానందపురం వయా గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలును కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రైలు నంబరు 07695 సికింద్రాబాద్- రామానందపురం ప్రతి బుధవారం ఈనెల 6 నుంచి 27వ తేదీ వరకు కేటాయించినట్లు వెల్లడించారు. రైలు 07696 రామానంతపురం-సికింద్రాబాద్ ప్రతి శుక్రవారం ఈనెల 8 నుంచి 29వ తేదీ వరకు కేటాయించినట్లు తెలిపారు. ఈరైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, చెంగల్‌పట్టు, విల్లుపురం మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

ప్రేమ పేరుతో నమ్మించి మోసం

ప్రత్తిపాడు: ప్రేమ పేరుతో యువతిని నమ్మించి మోసం చేసి వివాహం చేసుకున్న వ్యక్తిపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదైంది. ఎస్‌ఐ డి. రవీంద్ర బాబు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన షేక్ అస్మా స్థానికంగా పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆర్టీసీ బస్సుకు ప్రైవేటు డ్రైవర్ పని చేస్తున్న నగేష్‌తో 2022లో ఆమెకు పరిచయం ఏర్పడింది. అది ప్రేమకు దారితీసింది. అప్పటికే వివాహమైన నగేష్ ఆమెతో అబద్ధమాడాడు. తనకు ఇంకా వివాహం కాలేదని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. నిజమేనని నమ్మిన అస్మా ఇంట్లో కుటుంబ సభ్యులకు తన ప్రేమ విషయం చెప్పింది. దీంతో గత ఏడాది అస్మాను ఆమె కుటుంబ సభ్యులు నగేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం వారికి ఒక కుమారుడు. వివాహమైన తొలినాళ్లలో అస్మను బాగా చూసుకున్న నగేష్ రోజులు గడిచే కొద్దీ ఇంటికి సక్రమంగా రావడం మానేశాడు. గమనించిన ఆమె నగేష్‌ను అడిగింది. దీంతో ఇద్దరి మధ్యా గొడవలు మొదలై భార్యను మానసికంగా, శారీరకంగా హింసించడం మొదలుపెట్టాడు. అనుమానంతో అస్మా నగేష్‌ను గట్టిగా నిలదీయడంతో అసలు విషయం వెలుగు చూసింది. 2014లో తనకంటే ముందుగానే వేరొక మహిళతో వివాహమైనట్లు తెలిసింది. దీంతో మోసపోయినట్లు గ్రహించిన అస్మా ప్రత్తిపాడు పోలీసు స్టేషనులో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.